
దీపం.. దివ్యతేజం

కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శరణు ఘోషతో మారు మోగాయి. కార్తిక మాసంలో వచ్చిన పవిత్ర పౌర్ణమి కావడంతో శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు..


నార్నెపాడులోని శివాలయంలో


పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో స్వామి


పూజలు అందుకున్న శ్రీవారు


నర్సింగపాడు కాశీ విశ్వేశ్వరస్వామి


సత్తెనపల్లిలోని శివాలయంలో ధ్వజస్తంభానికి పూజలు


మాదిపాడులో సహస్రదీపోత్సవంలో భక్తులు


సత్యనారాయణ వ్రతంలో భక్తులు


సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని తెల్ల వారు జాము నుంచే అచ్చంపేట రోడ్డులోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్డులోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పెద్దమక్కెన గ్రామంలోని గంగాభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో జ్వాలాతోరణం, లక్షదీపారాధన, అయ్యప్ప స్వామి భజన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెదకూరపాడు: కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 75 త్యాళ్లూరు శ్రీ కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో కాశీ విశ్వేశ్వరునికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సామూహికంగా అన్నవరం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ధ్వజ స్తంభం, మర్రి, రావి, మారేడు, ఉసిరి వృక్షాల వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. నాగేంద్రస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించారు.

అచ్చంపేట: మాదిపాడు సమీపంలోని కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహించే పవిత్ర నందుల రేవు వద్ద వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సహస్ర దీపోత్సవం నిర్వహించారు. వేద పండితులు పవన్‌కుమార్ ఆచార్యులు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. కృష్ణానదీ తీరంలోని నందులరేవులో స్నానాలు ఆచరించి స్వామివారి ఆలయంలో నిర్వహించిన దీపోత్సవంలో పాల్గొన్నారు. నీలేశ్వరపాలెం శ్రీ గింజాసమేత నీలకంఠేశ్వరస్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలోని భ్రమరాంబ, గిరిజా సమేత మల్లిఖార్జునస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చామర్రులో పవిత్ర కృష్ణానది తీరంలో కాశీఅన్నపూర్ణేశ్వర స్వామివారి దేవాలయంలో విశిష్ట పూజలు నిర్వహించారు.

ముప్పాళ్ల: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సత్తెనపల్లి: గుడిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న అచ్చమాంబతల్లి ,పుల్లయ్య స్వాముల కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వ హించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తిక వనభోజనాలు చేపట్టారు. భక్తులు అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సత్తెనపల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో దీపోత్సవ సేవ నిర్వహించారు. ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, అలంకారం, గరుడాళ్వార్ అలంకారం చేశారు. తారక రామాసాగర్‌లో కృష్ణానది జలాలతో శ్రీవారికి కార్తిక మాస పౌర్ణమి పుష్కరిణి వద్ద పంచ హారతులు అందించారు. చంద్రప్రభ వాహనంపై వెన్న ముద్ద కృష్ణుని అలంకారంతో భక్తులందరూ దర్శించుకుని శ్రీవారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శ్రీవారి సేవా సమాజం బాధ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నకరికల్లు: కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ ఆలయాలన్నీ కిక్కిరిశాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు చేశారు. విశేష అలంకరణలో స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

బెల్లంకొండ: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని అన్నీ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బెల్లంకొండలోని గంగా పార్వతీ సమేత గౌతమేశ్వర నాగేశ్వర స్వామి ఆలయంలో, గంగిరెడ్డిపాలెం లోని గాయత్రీ పంచాయతన ఆశ్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి భక్తులు తాకిడి పెరిగింది. వివిధ గ్రామాల నుండి భక్తులు ఆలయానికి వచ్చి పొంగల్లు పొంగించారు.

క్రోసూరు: మండలంలోని అన్ని శివాలయాల్లో కార్తీక పూర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఆలయాల్లో జ్వాలతోరణాలు దీపాలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. క్రోసూర, పీసపాడు, దొడ్లేరు, బయ్యవరం, ఊటుకూరు, 88త్యాళ్లూరు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేసారు.

వైభవంగా గిరిప్రదక్షిణ


నకరికల్లు లక్ష్మీనర్సింహస్వామి కొండపై గిరిప్రదక్షిణ

నకరికల్లు: స్థానిక కొండపై వేంచేసి ఉన్న శ్రీ చెంచులక్ష్మి ఆదిలక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల తొలి గిరిప్రదక్షిణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సహకారంతో కొండపైన రెండు ఆలయాలకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసి, కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రారంభించారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల మెట్ల మార్గం ఎదుట ఉన్న నాగేంద్రుని పుట్ట వద్ద మహిళలు పసుపు, కుంకుమతో పూజాధికారులు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడవటికంటి మధుసూదనాచార్యులు, పాండురంగాచార్యులు లక్ష్మీనర్సింహస్వామిని, త్రిపురాంతకేశ్వరస్వామిని విశేషంగా అలంకరించారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

రాజుపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అధ్యక్షతన శనివారం జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సభ్యులు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ మెంబర్లు, మండలస్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని పేర్కొన్నారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

రాజుపాలెం: జాతీయ జెండాను, గీతాన్ని గౌరవించాలని పారా లీగల్ వలంటీర్ కోట బాబురావు అన్నారు. మండలంలోని పెదనెమలిపురి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. బాబు రావు మాట్లాడుతూ న్యాయం ముందు అందరూ సమానులేనన్నారు.రాజ్యాంగం ప్రాముఖ్యత, నైతిక విలువలను వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి, మహిళా పోలీసులు లక్ష్మీ ప్రసన్న, మేఘల్ అంజు జున్నీషాబేగం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

రాజుపాలెం: గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 7 గ్రామాల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన పనులను, ప్రణాళిక ప్రకారం తయారు చేసిన పనులను వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, ఎంఈవో మల్లికార్జునశర్మ, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్వింటా పత్తి రూ.10 వేలకు కొనుగోలు చేయాలి



పెదకూరపాడు: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాల ద్వారా క్వింటా పత్తి రూ.10 వేలకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ దానియేల్‌ను శుక్రవారం రైతులతో కలిసి, వినతిపత్రం అందించారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పత్తిలో తేమ శాతం నిబంధనలు సడలించి, క్వింటాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,521 నుంచి రూ. 10వేలకు పెంచాలని కోరారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని విన్నవించారు. ప్రతినిధులు ఎం.మస్తాన్‌రావు, వై.నరేంద్ర, మల్లేశ్వరరావు, లక్ష్మీకాంత్, పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అచ్చంపేట: విద్యుత్ లైన్లు క్రమబద్ధీకరించడంలో భాగంగా అచ్చంపేట మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి మరో 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందని, ఆలైన్ వేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం అనివార్యమైందని పేర్కొన్నారు.

పంటల క్షేత్ర సందర్శన

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, చాగంటివారిపాలెం, నార్నెపాడు గ్రామాల్లో వ్యవసాయ కళాశాల విద్యార్థినుల నిర్వహిస్తున్న గ్రామీణ అవగాహన వ్యవసాయ పని అనుభవం కార్యక్రమాన్ని ఎన్.జి.రంగా విశ్వ విద్యాలయం, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ శివన్నారాయణ శుక్రవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో అందజేసిన పత్తి, మిరప, శనగ, మొక్కజొన్న, వరి పంటల క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు ఉపయోగపడే పోస్టర్లు సమాచార కేంద్రంలో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, సత్తెనపల్లి ఏడీఏ ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్కరాజుగార్లపాడులో ఘోరం

ప్రమాదవశాత్తు మంటల్లో కాలిపోయి మృతి చెందిన వృద్ధుడు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గ్రామంలో ఘోరం జరిగింది. గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశ్వర్లు (85) పూరి గుడిసెలో నివసిస్తున్నాడు. వృద్ధుడు ఒక్కడే కొంత కాలంగా పూరిగుడిసెలోనే జీవిస్తుండగా శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా పూరి గుడిసె దహనమైంది. ఆ మంటల్లో నే వృద్ధుడు మృతి చెంది జీవశ్చవంలా పడి ఉన్నాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లన మంటలు వ్యాపించి ప్రమాదం జరిగిందా! లేక వృద్ధుడు చుట్ట తాగి ఆర్పక మంటలు వ్యాపించాయా? అనే దానిపై గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. వృద్ధుడు మృతి చెందడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి రూరల్ పోలీసు లు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెదకూరపాడు: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ మున్ని అన్నారు. మండలంలోని 75 తాళ్లూరు ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. షేక్ మున్ని మాట్లాడుతూ బాలల హక్కులు పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తల్లిదండ్రులు ముఖ్యంగా తెలుసుకోవాలన్నారు. అనంతరం గోడ పత్రికలు ఆవిష్కరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పెదకూరపాడు: యువత మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని పెదకూరపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసులు హెచ్చరించారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్రవారం డ్రగ్ ప్రివెన్షన్‌పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. పెదకూరపాడులోని శ్రీ కాకతీయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్రం యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర యువత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరం ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ అశోక్‌బాబు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు, పేస్ సొసైటీ సెక్రటరీ రమేష్, సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు, కో–ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి


యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ సభ్యులు

అచ్చంపేట: ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్సీని ప్రకటించాలని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు ఆళ్లమూడి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో సంఘ సభ్యులు శుక్రవారం సమావేశమయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యారంగానికి బడ్జెట్‌లో ఇచ్చిన ప్రాధాన్యతను ఇంకా పెంచాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హామీ మేరకు 117వ జీవోను రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌పై స్పష్టమైన వైఖరిని ప్రభుత్వం ప్రకటించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.ప్రకాశరావు ఆధ్వర్యంలో మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా టి.శౌర్రెడ్డి, అధ్యక్షుడిగా ఆళ్లమూడి వెంకటేశ్వరరావు, సహ అధ్యక్షుడిగా ఎ.రఘునాథ్, సహ అధ్యక్షురాలిగా ఎస్.వాసవికన్యక, ప్రధాన కార్యదర్శిగా షేక్ మస్తాన్‌వలి, కోశాధికారిగా సీహెచ్ పూర్ణ చంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ సీనియర్ నాయకులు తుమ్మా శౌర్రెడ్డి, మంగినపూడి శ్రీనివాసరావు, సీహెచ్ రమేష్, షేక్ మహబూబ్‌సుభాని, శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, సునీల్‌బాబు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం పంచాయతీల అభివృద్ధి



నకరికల్లు: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ జి.కాశయ్య అన్నారు. సర్పంచ్‌లకు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, వీఓలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీ శిక్షణ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ప్రణాళిక 2025–26లో భాగంగా 2024–25కు సంబంధించి ప్రజా ప్రణాళికా క్యాంపెయిన్ నిర్వహించుకోవాలన్నారు. ఐక్యరాజ్య సమితి సూచించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను 9 థీమ్స్‌ను స్థానీకరించడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. గ్రామ సభల నిర్వహణ, గ్రామాల్లో పేదరిక నిర్మూలన, పేదరిక తగ్గింపు ప్రణాళిక తదితర అంశాలపై కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కోర్సు డైరెక్టర్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కేవీ శివప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో గ్రంథాలయం కీలకం


మాట్లాడుతున్న సబ్‌జైలు ఇన్‌చార్జ్ సూపరిండెంట్ విశ్వేశ్వరరావు


గ్రంథాలయంలో పుస్త కపఠనం


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఈవో

సత్తెనపల్లి: సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకమని సబ్ జైలు ఇన్‌చార్జ్ సూపరిండెంట్ ఎస్.విశ్వేశ్వరరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, గ్రంథాలయాల ఉపయోగాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజుపాలెం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈవో మల్లికార్జున శర్మ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తక పఠనం ప్రాధాన్యతను ఆయన వివరించారు. గ్రంథాలయాధికారి కేఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు, వై.రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రోసూరు: స్థానిక గ్రంథాలయం శుక్రవారం మదక ద్రవ్యాల దుష్పలితాలపై అవగాహన సదస్సు చేపట్టి, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ, ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు జి.పద్మావతి, షేక్ సుభాని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన

పెదకూరపాడు: పెదకూరపాడులోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ అధికారి విమల గ్రంథాలయంలోని పుస్తకాల వివరాలు, చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మహిళా పోలీసు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలను తెలిపారు.

అమరావతి: స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ ఉత్సవాలు రెండవ రోజు వెల్లంకి వెంకటప్పయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుమారు 20 వేల పుస్తకాలను ప్రదర్శనకు ఉంచారు. విద్యార్థులతో గ్రంథాలయ అవశ్యకతపై ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి ఎం.వెంకాయమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్య విక్రయిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: అనధికార మద్యం విక్రయాలు జరపరాదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ పి.విజయకుమార్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రైవేటు మద్యం షాపుల లైసెన్సీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణదారుడు బెల్ట్ షాపులను నిర్వహిస్తే.. వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, షాపు లైసెన్సును రద్దు చేయడం జరుగుతుందన్నారు. అక్రమ నివారణపై పలు సూచనలు చేశారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పంచాయతీల అభివృద్ధి



అచ్చంపేట: ప్రణాళికాబద్ధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని శిక్షణ తరగతుల మాస్టర్ ట్రైనీ ఎం.పంతులూనాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాజులులో శుక్రవారం జరిగిన జీపీడీపీ 2024–2025 సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాబోయే రోజులలో పంచాయతీలకు కేంద్రప్రభుత్వం నిధులు టైడ్, అన్‌టైడ్ రానున్నాయని మాస్టర్ ట్రైనీ పంతులు నాయక్ తెలిపారు. ఆనిధులతో చపట్ట వలసిన పనులు, గ్రామసభలు ఏర్పాటు చేయుటకు సంబంధించిన విషయాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, ఎంపీపీ జి.నరశింహారెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.నాగరాజు, కార్యాలయ పరిపాలనాధికారి అంబటి రమేష్‌బాబు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

స్వామికి ఉత్సవం.. అమ్మకు హారతి















అమరావతి: పంచభూతాల్లో భాగమైన కృష్ణమ్మ కార్తిక పౌర్ణమి హారతి అందుకుంది. ప్రథమారామ క్షేత్ర దేవుడు అమరేశ్వరుడు బాల చాముండి సమేతుడై కృష్ణానది అలల తరంగాలపై పుష్పాలంకృతమైన తెప్పలో సేదతీరారు. భక్తుల పూజలందుకుని వారి మొరలను ఆలకించారు. చూసేందుకు కనులు చాలనంతగా తెప్పోత్సవం వైభవంగా సాగింది. అమరావతి కృష్ణాతీరం పులకించిపోయింది.